# తూర్పు ↔ పడమర

కె. ప్రవీణా రెడ్డి

**రూ.3,000 ప్రత్యేక బహుమతి పొందిన కథ**



బేగంపేట విమానాశ్రయం ఇంటర్నేషనల్ అరైవల్స్ నుంచి లగేజీ ట్రాలీ తోసుకుంటూ బయటికి వచ్చాడు డాక్టర్ డి.జె. అమెరికాలో స్థిరపడ్డ అతని పేరు ధనంజయ. చాలా రోజుల తర్వాత ఒక ముఖ్యమైన మెడికల్ కాన్ఫరెన్స్ కోసం స్వదేశానికి వచ్చాడు. తాను పుట్టి పెరిగిన దేశమే అయినా అతనికి ఇక్కడి వాతావరణం సరిపడనట్టుగా వుంది. ఎయిర్‌పోర్టు బయటికి వచ్చిన కొద్ది క్షణాల లోపే ఎండతాకిడికి అతని ముఖం ఎర్రబారింది. ఒంటికెక్కడ ధూళి సోకుతుందేమోనని భయపడుతున్నట్టున్నాడు.

ఇక్కడి గాలి పీలిస్తే ప్రమాదమన్నట్టుగా జేబురుమాలు ముక్కుకి అడ్డంగా పెట్టుకున్నాడు. ఇంతలో తాజ్‌గ్రూప్ వారి స్వాగతం ప్లకార్డ్‌తో డాక్టర్ డి.జె. కోసం కారు వచ్చి ఆగింది. తనకోసం వచ్చిన ఆ బెంజ్‌ని చూస్తూనే ప్రాణం లేచి వచ్చినట్టయింది అతనికి. యూనిఫాంలో ఉన్న డ్రైవర్ డోర్ తెరిచి పట్టుకున్న ఆ కార్లోకి ఎక్కబోతుంటే 'ధనూ' అన్న పిలుపు వినిపించడంతో చివ్వున అటు తిరిగాడు, అది తన పేరే అని జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

నీరుకావి పంచె లాల్చీ వేసుకున్న పెద్దాయనా, సాదాగా వున్న షర్టుపాంటులో ఓ నడివయసు వ్యక్తీ నిల్చుని ఉన్నారక్కడ. అన్నయ్య, బాబాయ్ ఒక్క అంగలో దగ్గరగా వచ్చారు. ''అరె! ఇంత దూరం మీరెందుకు వచ్చారు. నేనే ఊరొస్తానన్నాను కదా!'' అన్నాడు డి.జె.

''అదేంట్రా భలేవాడివే.. ఇన్నేళ్ళ తర్వాత అంతదూరం నుంచి నువ్వొస్తున్నావని తెలిసీ కనీసం ఇక్కడి వరకయినా రాకుండా ఎలా వుంటాం'' అన్నారు వాళ్ళు చిన్నబుచ్చుకుంటూ.

''అలా కాదన్నయ్యా ఊర్నుంచి ఇక్కడి వరకూ రావడం శ్రమవుతుందేమోననే ఉద్దేశంతో అన్నాను. నాకు కాన్ఫరెన్స్‌కి టైమవుతోంది. మీతో కాసేపు కూడా గడపలేను. ఇంతకు ఎలా వచ్చారిక్కడికి'' ఆడిగాడు.

''అద్దెకారు తీసుకుని వచ్చాము. ఇక్కడ ద్వారకా హోటల్లో గది తీసుకున్నాము పద వెళ్దాం టీ తాగి..అంటూండగానే- ''వద్దన్నయ్యా నాకు వేరే హోటల్లో రిజర్వేషన్ చేసి ఉంది. నా తోటి డాక్టర్లందరూ అక్కడే బస చేస్తారు. రేపట్నించి జరిగే వర్క్‌షాప్ గురించి మాటామంతీ అన్నీ ఉంటాయి. మీరు ఊరెళ్ళండి. మూడు రోజుల ఈ కాన్ఫరెన్స్ కాగానే నేనే అక్కడికి వస్తాను. వదినా, పిన్నీ వాళ్ళంతా బావున్నారా?''


''ఆ అందరూ బావున్నార్రా. మేం ఇక్కడికి బయలుదేరుతూంటే వాళ్ళు వస్తామని ఒకటే గొడవా..నువ్వు మమ్మల్నే రావద్దంటివి. వాళ్ళకేదో సర్ది చెప్పాం. ఉండబట్టలేక మేం వచ్చేశాంరా. వాళ్ళంతా అక్కడ నీకోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తుంటారు'' అన్నాడు బాబాయి.

''ఒరేయ్ నీకూడా మరదలూ, పిల్లలూ వస్తే బావుండేదిరా. వాళ్ళని మాతో బాటు ఊరికి తీసికెళ్తే ఈ మూడురోజులూ మా అందరి మధ్య సరదాగా గడిపేవాళ్ళు కదా..!'' అన్నాడు అన్నయ్య.

''అదెలా కుదురుతుంది ఈ నాలుగైదు రోజులూ హాస్పిటల్ చూసుకోవడానికి సుష్మ అక్కడ ఉండి తీరాలి. పిల్లలకు ఇప్పుడు సెలవులుండవు. అన్నయ్యా, మీరిక బయలుదేరండి. నా పనులు పూర్తవగానే వచ్చేస్తాను'' అంటూండగానే అతని సెల్ రింగయ్యింది. కాల్ రిసీవ్ చేసుకున్న

సి.పి.బ్రౌన్ అకాడమీ
నవ్యవీక్లి కథల పోటీ

# కథ



ధనంజయ పూర్తి అమెరికన్ ఆక్సెంట్‌లో మాట్లాడుతూంటే అన్నయ్య గర్వంగా 'నా తమ్ముడు' అనుకున్నాడు. వీళ్ళవంక వీడ్కోలు చెబుతున్నట్లుగా చెయ్యి వూపుతూనే కార్లో కూర్చున్నాడు. కారు డోర్ వినయంగా మూతపడింది. అది నిశ్శబ్దంగా కదిలింది. అద్దాల్లోంచి మసగ్గా కనబడుతున్నాడు ధనంజయ. వెళుతున్న ఆ కారు వంకే చూస్తూండిపోయారు వాళ్ళు. కనుమరుగవగానే కాళ్ళీడ్చుకుంటూ పార్కింగ్ వైపు వెళ్ళారు. టాటాసుమోలో కూర్చుంటూ ద్వారకా హోటల్‌కు పోనివ్వమని చెప్పారు డ్రైవర్‌తో. ధనంజయ తమతో ఉంటాడని తీసుకున్న గది ఖాళీ చెయ్యాలి కదా! అనుకుంటూ.

..గర్ర్..గర్ర్..మని డీజిల్ ఇంజను శబ్దం చేస్తూ పొగ రేపుకుంటూ వెళ్తున్న సుమోను ఆపి పార్కింగ్ ఫీజు కట్టమనడంతో జేబులోంచి రెండు యాభై నోట్లు తీసిచ్చాడు పెద్దాయన.

''అదేంటి బాబాయ్ నేనిచ్చేవాడిని కదా..!''

''పరవాలేదులేరా ఎవరిస్తే ఏంటి? ఆ వందతో మేడలు, మిద్దెలు కట్టం కదా..!''

* * *

తాను పుట్టి పెరిగిన ఊరికి ధనంజయ ఆరోజు ఉదయం చేరుకున్నాడు. కాన్ఫరెన్స్‌తో ఊపిరి సలపనంత బిజీగా ఉన్న అతనికి ఊరి ప్రయాణం తెరిపిగా అనిపించింది. రోడ్డుకు ఇరువైపులా పచ్చని తివాచీ పరుచుకున్నట్టున్న సెనగ చేల ఆకు పచ్చదనం, సెనగ పూల చక్కదనం కంటికింపుగా కనిపిస్తోంది. పొలాల్ని దాటుకుంటూ ఊళ్ళోకి వెళ్ళిన కారు ఇరుకు వీధుల్లోకి వెళ్ళలేకపోయింది. అతను కారు దిగి నడుస్తూ వెళ్ళాల్సి వచ్చింది. మధ్య మధ్యలో ఉన్న మురికి కాలువలను ముక్కు మూసుకుని దాటుకుంటూ వాటిల్లో దొర్లుతున్న పందుల వంక చికాగ్గా చూస్తూ, అప్పటికీ ఇప్పటికీ ఊరు పెద్దగా మారలేదు, కాకపోతే జీవనవిధానంలో కొద్దిగా మార్పు కనబడుతోంది అనుకున్నాడు. గుడ్డల మూటలను గాడిదపై కాకుండా సైకిల్‌పై మోసుకెళ్తున్న చాకలిమనిషి ఎదురయ్యాడు. బడికి వెళ్తున్న పిల్లలు యూనిఫాం తొడుక్కుని ఉన్నారు. పాలబ్బాయి లూనా మీద పాల క్యానుతో కనిపించాడు. చాలా ఇళ్ళ ముందర మోటారుబైకులు కనబడుతున్నాయి. దారి పొడుగునా సెల్‌ఫోన్ల రకరకాల రింగ్‌టోన్లు మోగడం వినిపిస్తోంది. చలికాలమే అయినా ఆ మాత్రం నడిచి ఇల్లు చేరేసరికే చెమటలు పట్టాయతనికి. 'అబ్బా.. ఉక్కగా ఉంది' అనుకున్నాడు ఇంట్లోకి వస్తూనే..వసారాలోనే తన కోసం ఎదురుచూస్తున్న వాళ్ళంతా రకరకాల పిలుపుల్తో చుట్టుముట్టారు. '' ఏరా బాగున్నావా'' ఆదరంగా పలికింది పిన్ని కంఠం. ''బాబాయొచ్చాడు'' ఆనందంగా అరిచారు అన్న పిల్లలు. ''వాడిని లోపలికి రానివ్వండి'' అన్నయ్య అంటున్నాడు. ఇరుగు పొరుగు కుతూహలంగా తమింటి వైపే తొంగి చూస్తున్నారు. వీధిన పోయే వాళ్ళు ఆగి ఇటే చూస్తున్నారు. రుమాలుతో చెమటలు తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు. చల్లటిగాలి శరీరానికి సోకుతూంటే తలపెకెత్తి చూశాడు. దూలానికి వేలాడుతూ తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ కనిపించింది. ''బాగున్నావా ధనూ'' వదిన కంఠం వినిపించడంతో ఇటు తిరిగాడు. తళతళలాడుతులా స్టీలు గ్లాసుల్లో మంచి నీళ్ళు, కాఫీ తీసుకు వచ్చిన వదిన అడుగు తోంది. బాగున్నానన్నట్టుగా తలూపాడు. ఆమె పలకరింపులో ఆప్యాయతా కళ్ళలో తొణికిసలాడుతున్న మమతానురాగాలూ పెదాలపై చిరునవ్వు ఎప్పట్లానే వున్నాయి. కానీ ఏదో వెలితి.. ఏమిటది? పదేళ్ళక్రితం చూసిప్పటికీ, ఇప్పటికీ కొద్దిగా జుట్టు నెరవడం తప్ప పెద్దగా మార్పేమీ లేదు. కానీ.. ఏదో లోటు ఆ ముఖంలో.. ఏమై ఉంటుందీ..?

''కాఫీ చల్లారుతుంది'' అన్నయ్య అనడంతో ఆలోచనల్ని పక్కనబెట్టి కాఫీ సిప్ చేస్తున్నాడు.

తనెదురుగా కూర్చుని కుతూహలంగా తన వంకే చూస్తున్న ఇద్దరి పిల్లల్ని చూపుతూ ''ప్రకాశ్ కొడుకులు'' అన్నాడు అన్నయ్య.

''ఓ అన్నయ్య మనవలా'' అనుకుంటూ వాళ్ళని దగ్గరగా తీసుకున్నాడు. లాగు చొక్కా తొడుక్కు ఉన్నారు వాళ్ళు. కాళ్ళకు చెప్పులు లేవు. మో చేతులకు, కాళ్ళకూ ఏ ఆటల్లోనో తగిలిన చిన్న చిన్న గాయాలు ఉన్నాయి. చలికాలం అవటం వల్ల వెర రలాడుతున్న వాళ్ళ వొళ్ళు చూడ్డానికే ఇబ్బ ందిగా ఉంది. తలకు రాసిన నూనెతో జిడ్డుగా కనబ డుతున్నాయి చెవులు. వాళ్ళని చూస్తున్న ధన జయ మదిలో తన పిల్లలు మెదిలారు. ఒళ్ళ తా వింటర్ క్రీమ్ రుద్దుకుని, ఒంటినిండా ఉన్ని దుస్తులు తొడుక్కుని హీటర్ వెచ్చదనంలో రగ్గు కప్పుకుని హాయిగా నిద్రపోయింటారీపాటికి. టైమ్ చూస్తూ అనుకున్నాడు. అంతలోనే ఇటు తిరిగి వాళ్ళవంక చూస్తూ ''స్కూలుకు వెళ్ళలేదే' అని అడిగాడు.

'నువ్వొస్తావని వెళ్ళలేదు రా'' అన్నయ్య సమాధాన చెప్పాడు.

'ఇలా బడి మానేస్తే పాఠాలు పోవూ?'' ఆశ్చర్యం గా అన్నాడు.

'పర్వాలేదులేరా పాఠాలు మళ్ళీ చదువుకుం టారు. మేమంతా ఎప్పుడూ నిన్ను తల్చుకుం టూ నీ గురించి చెప్పుకుంటాము. అవన్నీ విని దూ రదేశం నుంచి వస్తోన్న మా చిన్నతాతని ఎప్పుడు చూస్తామా అనే ఉబలాటం కొద్దీ వెళ్ళలేద . రెండ్రోజుల నుంచి నీకోసం ఎదురుచూస్తున్నా రు. ఆ చిన్నాడైతే రాత్రంతా నిద్రపోకుండా ఘ య ఘడియకి గడియారం వంకే చూస్తూ కూ ర్చున్నాడు'' అని చెబుతున్న అన్నయ్య మా టలు వింటూ 'ఈ పల్లె లాగానే ఇక్కడి మను షు లో కూడా మార్పు రాలేదు. ఆనాడు తను పట్టుదల గా చదివి ఇంతటి ఉన్నత స్థితికి ఎదిగాడు. తన కం టే కాస్త చిన్నవాడు అన్నయ్య కొడుకు 'ప్రకాశ్' ఆ రోజుల్లో అస్తమానం చెట్లూ పుట్టలూ పట్టుకు తిర గుతూ బడికి ఎగనామం పెట్టి అత్తెసరు మా ర్కులు తెచ్చుకునేవాడు. ఇప్పుడు పక్క వూళ్ళో రైస్ మిల్లు నడుపుకుంటున్నాడు. ఈ పిల్లలు కూడా బహుశా అదే బాటలో వెళ్తున్నట్టున్నారు. చిన్నతనం లోనే తల్లిని పోగొట్టుకున్న తను వదిన పెంపకం లోనే పెరిగాడు. స్కూలు ఫైనలవగానే టౌను కెళ్ళి హాస్టల్లో ఉంటూ చదివాడు. ఎంబిబియస్‌లో సీటు తెచ్చుకున్నాడు. మెరిట్‌తో అమెరికాకు వీసా, పెద్ద హాస్పిటల్లో రెసిడెన్సీ సాధించాడు. త్వరలోనే అక్క డి పద్ధతులకు అలవాటుపడ్డాడు. అక్కడే స్థిరపడా లన్న బలమైన కోరికతో వీసా ఎక్స్‌పైర్ అయ్యేలో పు సుష్మని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆమె కు గ్రీన్‌కార్డ్ వుంది. సుష్మ గుజరాతీ. తమకిప్పు డు ఇద్దరు పిల్లలు బంటి, బన్నీ.

భోజనం సిద్ధంగా ఉందన్న వదిన పిలుపుతో ఆల ోచనలకు బ్రేక్ వేసి ఫ్రెష్‌అప్ అవడానికి పెరట్లో కి వెళ్ళాడు ధనంజయ. లోపలికి వస్తూ నిజ ంగాఈ పల్లె వీసమెత్తు కూడా మారలేదు అని మ రోసారి అనుకున్నాడు.

వదిన తన కంచంలో వడ్డించిన వంటకాలు చూ సి జిహ్వ లేచి వచ్చినట్లయింది అతనికి. పొగలు కక్కుతున్న అన్నం, ఆవకాయ, ముద్దపప్పు, నువ్వు



తొరగా కట్టవయ్యా మగడా-చెమట కంపు!

పొడి, నాటుకోడి కూర.. అబ్బో ఎన్నాళ్ళయ్యింది ఇలాంటి భోజనం చేసి అనుకున్నాడు. నెయ్యి ధారగా వంపుతూంటే కమ్మని వాసన ముక్కుపుటాలకు సోకింది. అమ్మో..! అంత నెయ్యా..చాలు చాలు చెయ్యడ్డం పెడుతూ అన్నాడు. ''ఆమాత్రం లేకుంటే కారంతో నోరుమంట పుడుతుంది ధనూ'' అంది వదిన. అతనికి ఒక్కసారి అక్కడి తన సాపాటు గుర్తొచ్చింది.

నిద్ర లేస్తూనే ఆదరాబాదరా నాలుగు చేతులతో రెడీ అయిపోవడం,డబ్బాల్లో సిద్ధంగా దొరికే ఏదో ఒక సీరియల్ తిండి గబుక్కున తినేసి హాస్పిటల్‌కి పరుగు తీయడం. మళ్ళీ ఏ రాత్రికో అలిసిపోయి ఇంటికొచ్చిపడటం. ఫ్రిజ్‌లో పెట్టిన వంటల్ని మైక్రోవేవ్‌లో వేడి చేసుకు తినడం..అసలే నిలవవంటలు దానికి తోడు ఉప్పుకారాలు లేని గుజరాతీ వంటలు. ఆ తిండి అస్సలు రుచీపచీ ఉండదు. ఏదో ఒకటి తినాలి కదా అని తినడమే. గరిట నిండా వెన్న తీసి వడ్డిస్తున్న వదిన చేతి గాజుల చప్పుడుతో ధనూ ఇటు చూశాడు. వదిన చేతి వంట ఎంత రుచిగా ఉన్నా క్యాలరీల లెక్కతో కడుపు కట్టేసుకున్న అతను ఎక్కువగా తినలేకపోయాడు. భోజనం పూర్తయ్యాక చేయి కడుక్కోవడానికి పెరట్లోకి వెళ్ళగానే ఇద్దరు పాలేర్లు సిద్ధంగా ఉన్నారు. ఒకడు చెంబులో నీళ్ళతో, మరొకడు తుండు చేత పట్టుకుని. వాళ్ళని చూస్తూనే అతని కళ్ళ ముందు తనింట్లోని దృశ్యం కదలాడింది. భోజనం పూర్తవగానే ప్లేటూ, గ్లాసూ చేతబట్టుకుని సింక్ దగ్గరికెళ్ళి శుభ్రంగా కడిగి డిష్ వాషర్‌లో పెట్టేయడం.

''చినబాబుగారూ చేయి చాచండి'' పాలేరు అన్నాడు. చేయి కడుక్కుని వచ్చేసరికి బాబాయి కూతురు వరలక్ష్మి పళ్ళెంలో తాంబులాలు తెచ్చింది. అప్పట్లో కూడా పిన్ని దగ్గర తాంబులాలు చేసే సరకు సరంజామా ఎప్పుడూ సిద్ధంగా ఉండేది. విందు భోజనం చేయగానే అందరికీ చకాచకా తాంబులాలు కట్టి ఇచ్చేది. లవంగం, పచ్చ కర్పూరం ఘాటు.. నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా వుండే ఆ తాంబులపు రుచి తనకింకా జ్ఞాపకమే..అనుకుంటూ పళ్ళెంలోంచి తీసి బుగ్గన పెట్టుకున్నాడు. కళ్ళ మీదికి నిద్ర ముంచుకు రావడంతో గదిలోకి వెళ్ళి మంచంపై ఒరిగాడు. బాగా నిద్ర పట్టింది. మెలకువ రాగానే టైం చూస్తే సాయంకాలం ఐదు దాటుతోంది. అబ్బా.. ఎంతలా నిద్ర పట్టేసింది. ఎన్నాళ్ళైందో తనిలా ఆదమరిచి నిద్రపోయి. ఎప్పుడు నడుముకు బిగించుకున్న పేజర్‌లో మేసేజ్ బీపర్ వచ్చేస్తుందో..కాల్ మీద వెళ్ళాల్సొస్తుందోనని సిద్ధంగా ఉండటంలోనే రోజు గడిచిపోతుంది. ఇక కంటినిండా నిద్ర ప్రసక్తే లేదు అనుకుంటూ తెరిచి వున్న కిటికీలోంచి బయటికి చూశాడు. వసారాలో ఇరుగుపొరుగు వాళ్ళంతా ఉన్నట్టుగా ఉంది. ఏవో మాటలు వినపడుతున్నాయి.

''మీ మరిది అప్పట్లో కోడి గుడ్లు ఇష్టంగా తినేవాడమ్మా. ఊరొస్తున్నాడని విని రెండ్రోజులుగా మా కోళ్ళు పెట్టిన గుడ్లు దాచి ఉంచి తెచ్చాను. ఫారం గుడ్లు ఇంత రుచిగా ఉండవు. ఈ రాత్రికి వీటితో అట్టు చేసి పెట్టు బావుంటుంది'' అంటోంది ఎదురింటి సుశీలమ్మ.

''చెనగాకు కూర బాగా మిరపకారం వేసి వండాను. దాంతో తినడానికి వెన్నముద్ద కూడా తెచ్చాను'' అంటూ రెండు గిన్నెలు వదిన చేతికిచ్చింది సావిత్రమ్మ. ఇంతలో జొన్న రొట్టెల దొంతర పట్టుకుని వస్తోంది పక్కింటి శ్యామలమ్మ. ''అయ్యో మీకసలే ఆరోగ్యం బాగాలేదు.ఎందుకు పిన్నీ ఇవన్నీ చేశారు'' ఎదురెళుతూ అన్నది వదిన.

''అట్లా అంటావేమిటే? అతనెంతో ఇష్టంగా తినేవాడు. ఈమాత్రం చేసిపెట్టలేమా ఏమిటి'' అందావిడ నొచ్చుకుంటూ. నాలుగిళ్ళవతల ఉండే మాస్టారి భార్య సుగుణ వచ్చింది. ''బాగా మీగడ వేసి పెరుగు తోడు బెట్టాను, అందులో నంజుకోవడానికి చల్ల వూరుగు మిరపకాయలూ తెచ్చాను''

కిటికీలోంచి చూస్తున్న ధనంజయ బయటికి వచ్చి అందర్నీ పలకరించాడు. వాళ్ళతో మాట్లాడుతుండగానే అన్నయ్య వచ్చి ''ఏరా అలా పొలాల వైపు వెళ్దాం వస్తావా'' అడిగాడు. వస్తానన్నట్లుగా తలూపి దొడ్లోకి వెళ్ళాడు.

* * *

కబుర్లు చెప్పుకుంటూ పొలాల వైపు నడుస్తున్నారు అన్నదమ్ములు.''మూడేళ్ళబట్టి కరువు బారిన పడ్డాం. ఈ ఏడు వర్షాలు బాగా కురిశాయి కాబట్టి సరిపోయింది. లేకుంటూ అందరి పరిస్థితి దయనీయంగా ఉండేది'' అంటున్నాడన్నయ్య. ఇంతలో స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తి వీళ్ళని చూసి ఆగాడు. స్కూటరు పక్కన పెట్టి ఇటు వచ్చాడు. అతన్ని చూసిన అన్నయ్య ''మనవూరి డాక్టర్ హరిబాబుగారు'' అని పరిచయం చేశాడు.

''నమస్కారమండీ, మీరు ఊరొస్తున్నారని అన్నయ్యగారు మూడురోజులుగా చెబుతున్నారు. నేనే మీ ఇంటికి వచ్చి కలుద్దామనుకుంటున్నాను'' అన్నాడాయన చేయి కలుపుతూ. ఆ దారెంట వెళ్తున్న ఒకరిద్దరు హరిబాబును చూడగానే ''దండాలు డాక్టరు బాబూ'' అని పలకరించారు. అప్పటిదాకా డొంక మలుపులో నిల్చున్న ఆడమనిషి ఇటువైపు వచ్చింది. ''ఈవేళకు మీరిటు వైపు వెళ్తారనే దారి కాసి ఉన్నాను డాక్టరుబాబూ అంటూ స్కూటరు కొక్కేనికి ఓ సంచీ తగిలించింది. ''ఇప్పుడే కోసిన నవనవలాడే వంకాయలూ, తేగలూ ఉన్నాయందులో'' అన్నది.

''ఎందుకివన్నీ''

''రాత్రీ పగలనక మమ్మల్ని కనిపెట్టుకుని ఉండే మీకు ఇంతకంటే ఏమివ్వగలం'' అందామె.

చీకటిపడుతూండగా అన్నాదమ్ముళ్ళు ఇంటి దారి పట్టారు. దారిలో ఓ చోట ఎవరో పిల్లలు పోట్లాడుకుంటున్నారు. వాళ్ళల్లో ఒకడు అన్నయ్య మనవడు. అటువైపు వచ్చిన పెద్దవాళ్ళను చూడగానే అందరు పరుగెత్తారు.

''ఏరా ఏం జరిగింది?'' అడిగాడు అన్నయ్య మనవడిని పట్టుకుని.

''చూడు తాతయ్యా! ఆ రమేష్ గాడు ఆటలో ఓడిపోయాడన్న కోపంతో నా క్రికెట్ బ్యాట్ నేలకేసి కొట్టాడు. దాంతో కోపం వచ్చి రెండు తగిలించాను. వాడి గ్యాంగ్‌ని పోగేసుకువచ్చాడు నన్ను కొట్టించడానికి''

''అయ్యో దెబ్బలేమైనా తగిలాయా..!''

''ఊహు మిమ్మల్ని చూస్తూనే పారిపోయారు'' అని వాడు ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళాడు.

''వీడికి క్రికెట్ అంటే ప్రాణంరా, ఆ మధ్య నేనేదో పనిమీద హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఉప్పల్ దగ్గర ఇంగ్లీష్ బ్యాటొకటి తెచ్చాను. ప్రతి ఆటా వీడున్న టీమే గెలుస్తుంది. అందుకు కారణం వీడి



## నేను గ్లామర్ డాల్‌ని కాను

టాలీవుడ్‌లో నటి త్రిషకి తిరుగు లేదు. మంచి నటిగా గుర్తింపుతో పాటు అవార్డులు కూడఇక్కడ అందుకుంటోంది ఆమె. అదే కోలీవుడ్‌లో ఆమెకు గ్లామర్ డాల్‌గానే పేరు తప్ప మంచి నటి అన్న గుర్తింపు లేదు. ఆ గుర్తింపు కోసమే ఓ తమిళ సినిమాలో తన శక్తియుక్తులన్నీ ప్రదర్శించి నటిస్తోంది త్రిష. ఆ సినిమాకి అవార్డులు గ్యారంటీ అంటోంది. రేపు కోలీవుడ్ ప్రేక్షకులు తనని ఆ సినిమాలో చూసి, మరో రేవతి, మరో ఊర్వశి అనుకోవాలని త్రిష అభిప్రాయం. చూద్దాం!!

బ్యాటేనేమో అనే అపోహతో దాన్నెలాగైనా నాశనం చెయ్యాలని చూస్తున్నారు తక్కిన పిల్లలు. వీడేమో దాన్ని ఆరో(ప్రాణంలా కాపాడుకుంటున్నాడు'' మురిపెంగా మనవడి గురించి చెబుతున్నాడు అన్నయ్య. ధనంజయ మాత్రం లోలోపల ఈ పిల్లలు చదువుసంధ్యా మాని పాడైపోతున్నారనే నిర్ణయానికొచ్చేశాడు.

***

ధనంజయ ఆ దేశం వదిలి అయిదురోజులు అయింది. అటు నుంచి సుష్మ, ఇటునుంచి తను ఫోన్లు చేసుకుంటూనే వున్నారు. అయినా, అక్కడ డాక్టర్ వృత్తి అంటే అనుక్షణం జాగ్రత్తగా ఉండాలి. ఏ చిన్న పొరపాటు జరిగినా వృత్తికే ముప్పు వస్తుంది. అందుకే గంటగంటకీ సుష్మతో మాట్లాడు తూనే వున్నాడు. పైగా అక్కడికి ఇక్కడికీ రాత్రి పగలు తేడా. ధను భార్యతో మాట్లాడి ఫోన్ కట్ చేశాడు..బాగా రాత్రయింది. అతనికి నిద్రపట్ట డంలేదు. లీలగా కిటికీలోంచి అన్నయ్య వదినల మాటలు వినిపిస్తున్నాయి.

''లలితా, మనకేనాడూ తిండికీ గుడ్డకూ లోటు లేకపోవచ్చు. కానీ ఎన్నడూ నీకొక చిన్న నగైనా నేను చేయించింది లేదు. పైగా పుట్టింటివాళ్ళిచ్చిన ఆ...''

''ష్..ధనూ వినగలడు..పడుకోండి బాగా పొద్దుపోయింది'' అంది వదిన. అంతటితో వారి మాటలు ఆగిపోయాయి.

***

తెలతెలవారుతుండగానే నుదుటినిండా తిరు నామం దిద్దుకొని, పట్టుపంచె కప్పుకుని కేశవనా మాలు స్మరిస్తూ వచ్చారు మాధవాచార్యులు గారు. ఆయన వేణుగోపాలస్వామి ఆలయానికి అర్చక స్వామి. వెనకాల పదిహేనేళ్ళకుర్రాడు ప్యాంటు షర్టు వేసుకుని గుండు పిలకతో వచ్చాడు. అన్నయ్య ఆచార్యుల వారిని సాదరంగా పిలిచి, కూర్చోమ న్నారు. ధనంజయ వినయంగా నమస్కరించాడు. ఆయన ఎగాదిగా చూసి ''పెద్దవాళ్ళయినారు. సంతోషం. మీరంతా స్వామి ఆలయంలో ఆట లాడటం, అల్లరి చేయడం నాకు నిన్న మొన్నలా అనిపిస్తుంది'' ఆప్యాయంగా పెద్దాయన మాట్లాడు తుంటే, ధనంజయకు చక్కని సంగీతం వింటు న్నంత హాయిగా వుంది.

''..అన్నయ్య చెప్పే ఉంటారు. మీ వివాహ శుభసందర్భంగా మనవూరి వేలుపు వేణుగోపాల స్వామి కటాక్షం మీ నూతన దంపతులపై సదా ఉండాలని ఎన్ని మొక్కులు మొక్కారో! వట్టి మాటలు కాదయ్యా..ధ్వజస్తంభం శిథిలావస్థలో వుంటే, దానిని పదివేలు ఖర్చుపెట్టి పునరుద్ధ రించారు. పదివేలనగా వాళ్ళకెంత? నేను చెబితే మావాడు కాదనడు లెండి అని భరోసా ఇచ్చారు. అన్నట్టే మీరు డాలర్లు పంపి ఉంటారు.అన్నయ్య రూపాయల్లో స్వామికి జమ వేశారు. మళ్ళీ ఆల యానికి పూర్వ వైభవం వచ్చింది. ఇదిగో ఇవ్వాళ ప్రభాతసేవ కాగానే మీ గోత్రనామాలతో స్వామికి ప్రత్యేక అర్చన చేయించాను'' అంటూ పక్కనే నిల బడ్డ చిన్న కుర్రాడి చేతిలోని పళ్ళెంలోంచి తీర్థప్రసా దాలు ధనంజయకు అందించాడు.

''బాబూ, ఇవి శేషవస్త్రాలు. అమ్మవారి శేష వస్త్రం అమ్మాయికి తీసుకువెళ్ళు. ఇది నీకు అయ్య వారిది'' అంటూ ఆప్యాయంగా ధనంజయ భుజా ల మీద కప్పాడు అర్చకస్వామి. అతని కళ్ళు చెమ ర్చాయి. అప్రయత్నంగా మాధవాచార్యుల వారి పాదాలకు నమస్కరించాడు. అన్నయ్యాని, వదినని కన్నీటి తెర లోంచి కృతజ్ఞతగా చూశాడు.

***

పూర్తిగా తెల్లవారింది. వెళ్ళడానికి రెడీ అయ్యి గది బయటికి రాగానే వదిన అతని చేతికి కొత్త దుస్తులు కానుకగా ఇచ్చింది. ''నీ పెళ్ళి దేశం కాని దేశంలో జరిగింది. పెళ్ళయ్యాక మొదటిసారిగా ఈ ఇంటికి వచ్చావు. పట్టు చీరా, బంగారు గాజుల జత ఇస్తూ ''ఇవి చెల్లెలికివ్వు ధనూ'' అని రెండు సన్నని బంగారపు గొలుసులు చూపి ''ఇవి పిల్లలకు'' అన్నది.

''ఇప్పుడెందుకు వదినా ఇవన్నీ'' అంటూ ఆమె వైపు చూశాడు. ఆ మొహంలో తాను గమ నించిన వెలితేమిటో అతనికా క్షణంలో తళుక్కున మెరుపులా మెరిసింది. రవ్వల ముక్కు పుడక! అవును.. ఎప్పుడూ కోటేరు లాంటి ముక్కుని అంటి పెట్టుకుని మిలమిల మెరిసే ఆ ముక్కుపుడక లేదు.. అది వాళ్ళ పుట్టింటివాళ్ళు పెళ్ళప్పుడు పెట్టిన నగ. వదినకెంతో ఇష్టమైన నగ. చూసిన వాళ్ళంతా ఆ ముక్కుపుడక భలే ముచ్చటగా కుదురుగా ఉందే అనుకోవడం అతనికింకా జ్ఞాపకం.. ఆ ముక్కు పుడక.. లేని వెలితి..అది.

* * *

ధనంజయ కార్లో కూర్చోబోతుండగా పరుగె త్తుకు వచ్చిన అన్నయ్య మనవడు ఒగురుస్తూ నిల్చున్నాడు. విషయమేంటో అర్థం కాలేదతనికి. ఉన్నట్టుండి వాడు తన చేతిలోని క్రికెట్‌బ్యాటు ధనంజయ చేతికిస్తూ ''ఇది తీసుకెళ్ళి బంటీకివ్వండి చినతాతా... అక్కడ ఇలాంటివి దొరకవు కదా!'' అన్నాడు.

ధనంజయ క్షణంపాటు నివ్వెరపోయాడు. వీడ్కోలు చెప్పడం కూడా మరిచిపోయినట్లుగా ఉండిపోయాడు. కారు బయల్దేరింది. ఒక్కసారి అతనికి కారు ట్రంక్‌లో సూట్‌కేసు నిండా ఉన్న డాలర్ షాపు వస్తువులు కళ్ళముందు తిరిగాయి. డాలర్ షాపు వస్తువులంటే పై పూతలు పూసి, ఖరీ దైనవిగా భ్రమింపచేసేవని అమెరికాలో వుండే తనకు బాగా తెలుసు. అతని మనసు సిగ్గుతో కుంచించుకుపోయింది. వదిన శరీరంలో భాగమైన ముక్కుపుడక, తల్లులు తమ బిడ్డలకు కాదని దాచి ఉంచి తనకోసం తెచ్చిన కోడి గుడ్లు, వెన్న ముద్దలు, తన కుటుంబం మేలుకోరి ధ్వజస్తంభానికి అన్నయ్య ఇచ్చిన కానుక, అర్చకస్వామి తమని ఆశీ ర్వదిస్తూ కప్పిన శేషవస్త్రాలు ఒక్కసారి ఎన్నార్ఐ 'ధను' కళ్ళముందు తొలకరి మెరుపుల్లా మెరి శాయి. అన్నింటినీ డబ్బుల్లోకి మార్చలేం. డబ్బుల్తో వీటిల్లో దేన్నీ పొందలేము అనుకున్నాడు మిలియన్ డాలరు ప్రాక్టీషనర్. స్వదేశానికి బయల్దేరే ముందు ఇక్కడి వాళ్ళకు కానుకగా కొన్న ఆ వస్తు వులు పంచేందుకు చేతులు రాక తిరిగి తీసుకెళ్త న్నాడు. ఆ ఇంట్లో వాళ్ళేగాక ఆ ఊరివాళ్ళు కూడా తనకిష్టమైనవన్నీ గుర్తుపెట్టుకుని కడుపులు కట్టు కుని మరీ తెచ్చిపెట్టారు. పుట్టి పెరిగిన ఊరికి పెద్ద డాక్టరుగా ఎదిగి వచ్చాడు. విరిగిన ఎముకలనతి కించడంలో సిద్ధ హస్తుడు. కానీ డాక్టర్ హరిబాబు ఊరి వాళ్ళ మనసుల్లో గుడి కట్టుకున్న దేవుడు. మిలియన్ డాలరు ప్రాక్టీసున్న డాక్టర్ తాను. కానీ ఎంతో ప్రీతిపాత్రమైన క్రికెట్ బ్యాట్‌ని అతి సునా యసంగా వదులుకున్న ఆ పసిమనసు ముందు ఎంత అల్పుడు. ముక్కుపుడక లేని వదిన ముఖంలో తన మనసులోని వెలితి ప్రతి బింబించింది.

★

## రచయిత్రి పరిచయం



స్వస్థలం షామీర్ పేట మండలం దేవర యాంజాల. హైదరాబాద్‌లో బి.ఎ, చాలా ఆలస్యంగా జర్నలిజం కోర్సు చేశాను. మూడేళ్ళ స్వల్ప వ్యవధిలోనే అయిదు నవలలు, ముప్ఫై కథలు ప్రముఖ పత్రికల్లో వెలువడ్డాయి. 'రుధిరజ్యోత్స్న' ఆంధ్ర భూమి వారపత్రిక నవలల పోటీలో ఎంపిక అయింది. 'గెలుపు' కథకు నవ్య వీక్లి, 'కక్ష్య' కథకు విపుల బహుమతులు యిచ్చి ప్రోత్సహించాయి. 'అద్దంలో చందమామ' కథల సంపుటి, 'హితుడా ఓ రహస్య స్నేహితుడా' నవల విశాలాంధ్ర ద్వారా పుస్తకరూపంలో వచ్చాయి. మరో కథల సంపుటి 'నల్ల కలువ' త్వరలో రావడానికి సిద్ధమవుతోంది. రెండు నవలలు, కొన్ని కథలు మూడు ప్రముఖ ఛానెల్స్‌లో సీరియల్స్‌గా రూపుదిద్దుకుంటున్నాయి. బహుమతి యిచ్చి ప్రోత్సహించిన సి.పి.బ్రౌన్ అకాడమీ, నవ్య వీక్లి వారికి ధన్యవాదాలు. ప్రస్తుత నివాసం హైదరాబాద్.

-కె.ప్రవీణరెడ్డి